# ప్రపంచం

శ్రీ నరశింగరావు

ప్రపంచం మిధ్య అని వాదిస్తూ అందులోవున్న మానవుడు తనుమాత్రం శాశ్వతం అనుకొని అధికారంకోసం ధనం కోసం ప్రాకులాడుతున్నాడు——యీ ప్రపంచం ఒక నాటకరంగమని అమాయకులకు బోధించి తను మాత్రం ఆ నాటకంలో ముఖ్యపాత్ర ధరిస్తున్నాడు. అందరి హృదయాలు తనకువలెనే భాగ్యభోగాలు కోరుతయి అని తెలుసుకుంటే ప్రపంచం యింత హీనస్థితిలో వుండదు.

తను కర్మాగారం దగ్గరకు వస్తూంటే కోలాహలం ప్రళయం వినబడ్డది. యిక నేదో ఆరోజున పెను తండ్రీ కొడుకులకు వస్తుందని భయపడ్డాడు. కోపంచేత భయంచేత అతని ముఖం చెమటలుపోసి భీకరాకారం దాల్చింది. ఆవరణలో కాలుపెట్టేసరికల్లా కార్మికులంతా జండాలు పట్టుకుని కార్మికగీతాలు పాడుతూ ముందుకుపెద్ద ప్రవాహంలా తోసుకొస్తున్నారు. కారు దిగి తిన్నగా మధ్యకెళ్లేడు. ప్రశాంతవదనంతో చిరునవ్వునవ్వుతూ మధ్యనున్నాడు జయదేవుడు. తండ్రిని చూసేసరికల్లా అతని కదో విధమయిన భయంవేసి ముఖకాంతి కొంత తగ్గింది. ముఖమువంచి తండ్రికి నమస్కారంచేసేడు.

"జయదేవ్" అన్నాడు మేఘ గర్జనలా వెలువడింది.

"తండ్రీ"

"అమాయకపు జనాన్ని వశంచేసుకొని వాళ్ళని అధోగతిలోకి తీసుకురా చూస్తూన్నావు జాగ్రత్త"

"కూటికీ గుడ్డకూ వాచి కలకాలం బ్రతికేకంటె యిదే నయం.

"నయం!" శాంతి ప్రయత్నం అంటూ దుర్మార్గాన్ని విరోధ భావాలనీ వృద్ధిచేస్తున్నావు.

"శాంతి" అన్నది వుంటే యీ దుర్మార్గం వుండనే వుండదు, అది లేకపోబట్టే యివన్నీని.

"నిష్కారణంగా కష్టాల పాలవుతావు జాగ్రత్త".

"అన్నీ ఆలోచించుకొనే జొరబడ్డాను"

"అయితే యీ దుర్మార్గాన్ని మానవు!"

"మానేయడానికి యిందులో ఏమీలేదు. వాళ్ల కనీసపుకోర్కెలు తీర్చుతానంటే యీ క్షణంలో వాళ్లు పనిలోకి పోతారు".

"కోర్కెలు! వెధవకోర్కెలు! అధికారిమీద తిరుగుబాటు——"

"కోర్కెలు? కోర్కెలు కావు? చూడు, నీఒక్కని ఆశకోసం, నీ సుఖంకోసం ఎన్ని జీవులు, రెక్కలు విరచుకొని యంత్రాలుగా నీకోసం పని చేస్తున్నయో చూడు! యిన్ని జీవులు కష్టించి పెడుతూ వుంటే మహా సౌఖ్యం అనుభవిస్తూ ప్రపంచం అంతా నీలాగునే సుఖం అనుభవిస్తోందని కలలు కంటున్నావు-హృదయం వున్న ప్రతిజీవీ ఆనందాన్ని సుఖాన్ని కోరుతుందని తెలియదు కాబోలు.

యీ మాటలైనా వినిపించుకోకుండా వెళ్లిపోయేడు తండ్రి——

మూడు రోజులవరకూ కార్మికులెవరూ పనిలోనికి వెళ్ళలేదు. తమ కోర్కెలు నెరవేరేవరకు పనిలోకి వెళ్ళమని ప్రమాణాలు చేసుకున్నారు.

తానొక్కడూ యీ రెండువేలమంది కార్మికుల తరపున ప్రతినిధిగా అర్ధరాత్రాన్న రాయబారం జరిపేడు- కాని లాభం లేకపోయింది.

పూర్ణిమ. మేఘాల చాటునబడి చంద్రుడు ప్రపంచాన్ని తొంగితొంగి చూస్తున్నాడు——చెట్టుక్రింద చాపవేసుకొని జయదేవుడు- చంద్రుడ్ని- కర్మాగారాన్ని చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. అలా ఆలోచిస్తున్న కొద్దీ అతనికి దేశంలో జరుగుతూ వుండే

అన్యాయాలు, దుర్మార్గం కళ్లకు కనబడి, ఆలోచిస్తున్న కొద్దీ అతనికి ఆవేశము వుద్రేకమూ యెక్కువయి నయి. కాని ఏంచేయగలడు. అంతా పరాధీనం— తన దేశాన్ని దరిద్రభూయిష్టంగా చేసే సామ్రాజ్య భావాన్ని తల్చుకుని రెండు కన్నీటి బిందువులు వొదిలేడు.

నోరులేని అమాయకపు జనాన్ని, బీదలని పీల్చి వాళ్ళభావస్వాతంత్ర్యమును పురాతనం నుండి అరికట్టి వాళ్లని యంత్రాలుగా తయారుచేసి సామ్రాజ్యభావానికి పునాదైన మతాన్ని తల్చుకుని కన్నీరొదిలేడు. యివన్నీ తల్చుకుంటూంటే అతని హృదయం నీరయిపోతోంది. ప్రపంచం అంతా తనవలె మంచిహృదయం కలది—సంస్కారం లేక చెడి పోతోంది అని అనుకొన్న ఆ యువకునకు నాటి సంఘుల్బట్టనతో సామ్రాజ్య భావం తండ్రీ కొడుకులకు విరోధం తెస్తుందని ఆనాడు బోధపడింది. యిలా ప్రపంచ దృశ్యాలన్నీ తల్చుకొని ఆలోచిస్తూ వుంటే అతని హృదయం బరువెక్కి పోయింది....—

మరునాడు సాయంత్రము వరకూ రాయబారం జరిపేడు- లాభం లేకపోయింది—

సముద్రపొడ్డున జనం యిసుకవేస్తే రాలకుండా వున్నారు. జయదేవుడు శాంతంగా వేదికనెక్కి కార్మికుల నుద్దేశించి వుపన్యాసం యిస్తున్నాడు—కాని స్వాతంత్ర్యం కోసం పాటుబడి- విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రజలకి బహిరంగంగా చెపితే ఏమవుతుంది? కారాగారా ప్రాప్తి.

జయిలులోకి వెళ్ళినతరువాత అతనికి అంతులేని దుఃఖము కలిగినది. తనవల్ల నిష్కారణంగా ఎందరో కార్మికులు వుపవాసాలు చేస్తున్నారని తెలిసింది. తిండయినా తినడం మానేసేడు. ఎప్పుడూ అదే చింత— అదే లోకం. అదో పిచ్చివానిలా తయారయినాడు- అతనికి సహజమయిన హృద్రోగం యెక్కువయింది.

జయిలు! మనవుని పవిత్రాత్మ అందులో వుండి మరింత భీకర రూపం చెందుతుంది. ప్రపంచం అంటే ఏమిటో తెలియకపోడంచే మానవుడు—సోదర భావాలని పోగొట్టుకొని కఠిన హృదయుడవుతాడు-అతని వుద్రేకమూ అణగదు...అతని ఆశయాలు—పోవు; కాని పయికొచ్చి తరువాత విప్లవ శక్తులను మరింత విజృంభింప చేస్తాడు.

తండ్రి-తన శరీరంలోంచి రక్తంలోంచి పుట్టిన కొడుకు జయిలులోపడి పిచ్చివాడయినాడంటే ఎంత రాతిగుండె కలవాడయినా వూరుకోగలడా? లేదు. జయిలుకు చాలసార్లు పోయిచూచేడు- పలుకరిద్దామని పిల్చినా నమస్కారంచేసి వూరుకోడం తప్ప జయదేవుడింకోమాట పలుకలేదు.

మరునాడు సాయంత్రం తండ్రి చూద్దామని వచ్చేడు-జయదేవుడు నేలమీద పడుకొని యున్నాడు- ఎంతపిల్చినా కళ్లయినా తేరువలేదు—పిచ్చివానిలా "కెవ్వ"ని కేకవేసి జయిలులోకి పరిగెత్తబోయేడు. కాని ఏంలాభం!

మధ్యను యీ ప్రపంచంతో సంబంధంలేని యినుపగజాలు-తలనుండి నెత్తురు ధారగా కారుతోంది.

అధికారులువచ్చి తలుపుతాళం తీసేరు-కొడుకు బ్రతికితే వాడి కోర్కెలుతీర్చి దేవుళ్ళకి ముడుపులు కడతానని మొక్కుకున్నాడు. జయిలంతా ప్రతిధ్వనిస్తోంది అతని ఏడులువల్ల-ఏం లాభం-అతని హృదయమపుడే ఆగిపోయినట్లున్నది.

యీవార్త వూరల్లా ప్రాకిపోయింది. సమ్మెలో పాల్గొనని కార్మికులుకూడా యజమానుల నడుగకుండా పరిగెత్తుకొనివచ్చేరు-అధికారులెంత ఆపినా ఆప్రవాహం ఆగలేదు-సరి! ఆతరుణ వయస్కు ప్రాణములు వదలాడు.

జయదేవుని కళేబరం శ్మశానవాటిలో భీకరాగ్ని జ్వాలలలో మండుతోంది. కార్మికుల కన్నీటి బిందువులు అతని హృదయాన్ని శాంతపరాస్తున్నయి.